
# షుగర్ జెల్‌తో బట్టతలకు చెక్!

### కొత్త చికిత్సను అభివృద్ధి చేసిన పరిశోధకులు



లండన్, మార్చి 23: బట్టతలతో బాధ పడుతున్నవారికి శుభవార్త. వంశపారం పర్యంగా, జన్యుపరంగా సంక్రమించిన బట్టతలకు చెక్ పెట్టే సరికొత్త చికిత్సను పరిశోధకులు కనుగొన్నారు. ఒక అంశంపై అధ్యయనం చేస్తున్న పరిశోధ కులకు మరో రోగానికి విరుగుడు లభిం చడం విశేషం. మానవ శరీరంలో ఉండే డియోక్సీరైబోస్ అనే షుగర్ జెల్ సాయంతో బట్టతలను నయం చేయవ చ్చని పరిశోధకులు కనుగొన్నారు. ఇంగ్లండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ షెఫీల్డ్, పాకిస్థాన్‌లోని కాస్మట్స్ యూనివర్సిటీ పరిశోధకులు గాయాన్ని నయం చేయ డంలో ఈ షుగర్ జెల్ పాత్రపై పరిశోధ నలు చేశారు. గాయం చుట్టూ ఈ షుగర్ జెల్‌ను పూసి అధ్యయనం చేయగా.. అక్కడున్న వెంట్రుకలు అసాధారణంగా పెరగడాన్ని వారు గుర్తించారు. గాయా నికి చికిత్సకు నోచుకోని ఎలుకల కంటే చికిత్స తీసుకుంటున్న ఎలుకల్లో వెంట్రు కల పెరుగుదల ఎక్కువగా ఉన్నట్టు తెలు సుకున్నారు. దీంతో దీనిపై ప్రత్యేకంగా మరిన్ని పరిశోధనలు చేయాలని నిర్ణ యించారు. ఈ మేరకు ఫ్రాంటియర్స్ ఇన్ ఫార్మాకాలజీ జర్నల్‌లో అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి.

**రక్త సరఫరా మెరుగుపరిచి...**

అధ్యయనంలో భాగంగా మగ ఎలుక లపై పరిశోధనలు చేశారు. వాటి శరీ రంపై ఉండే వెంట్రుకలను తొలగించి రోజు డియోక్సీరైబోస్ షుగర్ జెల్‌ను పూశారు. కొన్ని రోజుల్లోనే వాటి శరీ రంపై మందపాటి, పొడవైన వెంట్రు కలు మొలవడాన్ని గుర్తించారు. ఈ జెల్ జుట్టు కుదుళ్లకు రక్త సరఫరాను మెరుగు పరిచి, తద్వారా జుట్టు పెరిగేందుకు దోహద పడుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు.

**మరిన్ని పరిశోధనలు అవసరం...**

వంశపారంపర్యంగా, జన్యు లోపాల వల్ల సంక్రమించే బట్టతలను ఆండ్రోజె నెటిక్ అలోపెసియా అని కూడా పిలు స్తారు. వృద్ధాప్యం, హార్మోన్ స్థాయుల కారణంగా ఈ సమస్య తలెత్తుతుంది. ఇది పురుషులు, మహిళల్లో వేర్వేరుగా ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా లక్షల మందిపై ప్రభావం చూపుతున్నది. దీనికి పలు రకాల చికిత్సలు అందుబా టులో ఉన్నప్పటికీ అవి సమర్థంగా పని చేయడం లేదు. అంతేకాకుండా, ఈ చికిత్స వల్ల కొన్ని దుష్ప్రభావాలు ఉండటం ప్రతికూలంగా మారింది. ఈ నేపథ్యంలో తాజాగా కనుగొన్న చికిత్స ప్రభావవంతంగా పని చేసే అవకాశ ముందని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే, మానవు లపై అధ్యయనం చేయాల్సి ఉంది. అందులో మెరుగైన ఫలితాలు వస్తే బట్ట తల సమస్యకు చెక్ పెట్టవచ్చు.

# డ్రోన్ దాడులను తిప్పికొట్టే డీ4

### యాంటీ డ్రోన్ వ్యవస్థను ఆవిష్కరించిన భారత్

న్యూఢిల్లీ, మార్చి 23: మన వైమానిక రక్షణ దళంలో కొత్త సాంకేతికత చేరింది. రక్షణ వ్యవస్థలో గేమ్ ఛేంజర్ లాంటి శక్తివంతమైన డీ4తో మన వైమానిక దళం మరింత పటిష్టంగా మారనుంది. నేటి ఆధునిక యుగంలో డ్రోన్లు యుద్ధ రంగంలో కీలకంగా మారాయి. జమ్మూ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌పై 2021లో జరిగిన డ్రోన్ దాడినే దీనికి ఉదాహరణగా పేర్కొనవచ్చు. అయితే భవిష్యత్తులో భారత్‌కు ఇలాంటి పరిస్థితి ఎదురుకాకుండా సమర్థంగా డ్రోన్ దాడులను ఎదుర్కొనేందుకే మన వైమానిక దళం యాంటీ డ్రోన్ వ్యవస్థను ఆవిష్కరించింది. డీఆర్‌డీవో ఆధ్వర్యంలో తయారైన డీ4ను దేశ సరిహద్దుల్లోని ప్రధాన ప్రాంతాల్లో మోహరిస్తారు. డ్రోన్ గుర్తింపు, అడ్డగింత, నాశనం ఈ మూడు లక్షణాలు కలిగి ఉన్న డీ4 ఇప్పటివరకు మన సరిహద్దుల వద్ద ఉన్న బలహీన పరిస్థితులను అధిగమిస్తుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తు న్నారు. ఈ ప్రాజెక్టు బహుళస్థాయిలుగా ఉంటుంది. వివిధ సాంకేతిక పరిజ్ఞానాల ఏకీకరణతో దీనిని రూపొందించారు. ముఖ్యంగా ఇందులో రేడియో ఫ్రీక్వెన్సీ గుర్తింపు, రాడార్, ఎలక్ట్రో ఆప్టికల్ ట్రాకింగ్, కృత్రిమ మేధ ఆధారిత ముప్పు వర్గీక రణ, ఎలక్ట్రానిక్ జామింగ్, యుక్తి ప్రదర్శన, హార్డ్ కిల్, సాఫ్ట్ కిల్ న్యూట్రలైజేషన్ వంటి సాంకేతికతలను పొందుపరిచారు.



# సిమెంట్ వాడని రాతి ఇల్లు!

### వెయ్యేండ్ల పాటు చెక్కు చెదరదట.. వైరల్‌గా మారిన బెంగళూరు ఇల్లు

బెంగళూరు: సిమెంట్‌ను వాడకుండా ఇల్లు కట్టడమా? అది కూడా రాళ్లతో! కంటెంట్ క్రియేటర్ ప్రియం సారస్వత్ వెలుగులోకి తెచ్చిన ఈ ఇల్లు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ ఇంటి వీడియో టూర్‌లో ఇంటి యజమానితోపాటు, దీని ఆర్కిటెక్ట్ కూడా ఆసక్తికర విషయాలను చెప్పారు. ఇంటి యజమాని మాట్లాడుతూ, ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి సిమెంట్ రహిత రాతి ఇల్లు అని తెలిపారు. స్థిరంగా ఉండటానికి మాత్రమే కాకుండా 1,000 సంవత్స రాలకుపైగా చెక్కు చెదరకుండా ఉండేలా దీనిని నిర్మించినట్లు చెప్పారు. అత్యంత జాగ్రత్తగా ఎంపిక చేసిన రాతిని వినియోగించామన్నారు. గ్రే గ్రానైట్, శాండ్‌స్టోన్ వంటివాటిని వాడినట్లు తెలిపారు. వీటిని సంప్రదాయ ఇంటర్‌లాకింగ్ టెక్నిక్స్‌తో ఫిట్ చేశామన్నారు. సిమెంట్, జింక, బంక, బ్లాస్టింగ్ వంటివాటిని వినియోగించ లేదని చెప్పారు. కేవలం రాళ్లు, నైపుణ్యం, కచ్చితత్వాలను మాత్రమే వినియోగిం చామని తెలిపారు. ఈ వీడియోను చూసిన నెటిజన్లు అబ్బురపడుతున్నారు. వెయ్యేళ్లు చెక్కు చెదరకుండా నిలిచే ఇంటి గురించి తెలుసుకుని ఆశ్చర్యపోతున్నారు. ప్రాచీన భారతీయ వాస్తు కళలో ఇటువంటి చిట్కాలనే ఉపయోగించేవారని గుర్తు చేస్తున్నారు. ఇది ఆధునిక పునరుజ్జీవనమని హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# రెంట్‌కు హ్యూమనాయిడ్ రోబో

- ఇంటి పనుల నుంచి డేటింగ్ వరకు సేవలు.. చైనాలో రోబో సంస్కృతి

బీజింగ్, మార్చి 23: చైనాలో రోబోల వాడకం క్రమంగా పెరుగుతున్నది. ఏకంగా హ్యూమనాయిడ్ రోబోలను అద్దెకు తెచ్చుకునే సంస్కృతి వచ్చింది. చైనాకు చెందిన జాంగ్ జెన్‌యువన్ అనే ఇన్‌ఫ్లుయెన్సర్ తాను యూనిట్రీ జీ1 హ్యూమనాయిడ్ రోబోలను అద్దెకు తెచ్చుకున్నట్టు ఓ వీడియో పోస్ట్ చేయగా అది వైరలైంది. అందుకు గానూ ఒక్క రోజుకు 1000 యువాన్లు (1400 డాలర్లు) చెల్లించినట్టు అతడు తెలి పాడు. రోబో సేవలతో తాను సంతృప్తి చెందినట్టు అతడు వివరించాడు. డ్యాన్స్ చేయడం, ఇల్లు క్లీనింగ్, వంట తదితర పనులు చేస్తున్న రోబో గుడ్డు పగటగొట్ట డంలో మాత్రం కాస్త ఇబ్బంది పడినట్టు వీడియోలో తెలుస్తున్నది. యూనిట్రీ జీ1 హ్యూమనాయిడ్ రోబోలను చైనీయులు రోజువారీగా అద్దెకు తీసుకుంటున్నారు. ఈ రోబోలు ఇల్లు క్లీన్ చేయడం, వంటలు వండటం, సంభాషణలు, డేట్ లాంటివి చేస్తాయి. అందుకు రోజుకు 8 వేల నుంచి 16 వేల యువాన్లు (1100 నుంచి 2200 డాలర్లు) చెల్లించాల్సి ఉంటుంది. ఈ రోబోలను యూనిట్రీ రోబోటిక్స్ కంపెనీ అభివృద్ధి చేసింది.

# ‘గ్రోక్’ ఘాటు.. బీజేపీకి తలపోటు

- దేశంలో కొనసాగుతున్న ఏఐ రాజకీయ ప్రకంపనలు
- అధికార పార్టీని ఇరుకున పెడుతున్న చాట్ బాట్
- ప్రధాని నరేంద్రమోదీపై ఎక్స్‌లో ఘాటు వ్యాఖ్యలు
- బీజేపీకి సంబంధించిన ప్రశ్నలపైనా ఇదే తీరు
- ప్రతిపక్షాలకు అస్త్రంగా మారిన సమాధానాలు
- బీజేపీ ‘డిజిటల్’ దూకుడుకు చాట్‌బాట్ బ్రేకులు




హైదరాబాద్, మార్చి 23 ( నమస్తే తెలంగాణ): దేశ రాజకీయాల్లో ‘గ్రోక్’ సంచలనం రేపుతున్నది. ‘ఎక్స్’ (ట్విట్టర్)కు చెందిన ఈ చాట్ బాట్.. కేంద్రంలోని అధికార బీజేపీకి పంటి కింద రాయిలా ఇబ్బంది పెడుతున్నది. 11 ఏండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి చక్రం తిప్పుతున్న ప్రధాని మోదీకి, ఇతర అధికారపక్ష కీలక నాయకులకు కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతోంది. దాదాపు దశాబ్దన్నర కాలంగా సోషల్ మీడియాలో, దేశంలోని ఇతర డిజిటల్ వేదికల్లో పెత్తనం చెలాయిస్తున్న బీజేపీ దూకుడుకు బ్రేకులు వేస్తోంది. బీజేపీ ఏకంగా ‘గో బ్యాక్ గ్రోక్’ ఉద్యమం ప్రారంభించిందంటేనే పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

**ఎలా మొదలైందంటే..**

టోకా అనే ఎక్స్ ఖాతా నుంచి కొన్ని రోజుల కింద వచ్చిన ఒక ప్రశ్నతో దేశంలో గ్రోక్ సంచలనాలు మొదలయ్యాయని చెప్తున్నారు. తన ఖాతాను అనుసరిస్తున్న వారిలో తనలాంటి భావజాలం ఉన్న పదిమందిని ఎంపిక చేయాలని టోకా కోరారు. గ్రోక్ ఆలస్యంగా సమాధానం ఇవ్వడంతో టోకా అసహనం వ్యక్తం చేస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీంతో చాట్ బాట్ ఎదురుదాడి ప్రారంభించింది. టోకాకు హిందీలో సమాధానం ఇచ్చే క్రమంలో కొన్ని బూతులు వాడింది. దీంతో గ్రోక్ వ్యవహార శైలిపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఆ తర్వాత అనేక అంశాలపై వరుసగా ప్రశ్నలు గుప్పిస్తూ దానిని రెచ్చగొట్టారు. వాటన్నింటికీ ఏఐ చాట్ బాట్ నిర్మొహమాటంగా, ఘాటు వ్యాఖ్యలతో సమాధానాలు ఇస్తుండడంతో ప్రశ్నల వరద పెరిగింది. ఈ క్రమంలో కొందరు ప్రధాని మోదీ, బీజేపీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్‌పై అడిగిన ప్రశ్నలకు గ్రోక్ ఇచ్చిన సమాధానాలు సంచలనంగా మారాయి. అప్పటి నుంచి రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. వాస్తవానికి గ్రోక్ మొదటి నుంచి ఇలాంటి సమాధానాలు ఇస్తున్నదని నిపుణులు చెప్తున్నారు. మస్క్ ఎవరు? అని ఒకరు ప్రశ్నించగా.. ఎక్స్‌లో అత్యధిక నకిలీ వార్తలు సృష్టించే వ్యక్తిగా అభివర్ణించింది. తన సృష్టికర్తపైనే ఘాటు వ్యాఖ్యలు చేసింది.

**మోదీ, అమిత్ షాను అరెస్ట్ చేస్తారట..**

రాజకీయ ప్రశ్నలకు గ్రోక్ ఇస్తున్న సమాధానాలు సంచలనం రేపుతున్నాయి. ముఖ్యంగా ప్రధాని మోదీ, బీజేపీ నేతల మీద అడుగుతున్న ప్రశ్నలకు గ్రోక్ ఇస్తున్న సమాధానాలు కమలనాథులకు మింగుడు పడటం లేదు. మోదీ ప్రధాని అయ్యాక నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌ల గురించి విశ్లేషించాలని కోరగా.. మోదీ మీడియా ముందుకు రావడం లేదని, మాట్లాడే పనిని అమిత్ షాకు అప్పగించారంటూ సమాధానం ఇచ్చింది. అంతేకాదు మోదీ ఇచ్చే ఇంటర్వ్యూలన్నీ స్క్రిప్టెడ్ (ముందే సిద్ధం చేసుకున్న ప్రశ్న, జవాబులు) గా అనిపిస్తున్నాయని వ్యాఖ్యానించింది. దీంతో గ్రోక్ చుట్టూ రాజకీయాలు తిరగడం మొదలయ్యాయి. దేశంలో అత్యధికంగా నకిలీ వార్తలు ఎవరు ప్రచారం చేస్తున్నారని ఒకరు ప్రశ్నించగా.. దేశంలోని అనేక ప్రముఖ మీడియా సంస్థల పేర్లను, వాటిల్లోని ముఖ్య అధికారుల పేర్లను చెప్పింది. ప్రధాన మీడియా సంస్థలపై బీజేపీ ప్రభావం గురించి అడగగా.. మోదీతో సన్నిహితంగా ఉన్న అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ పెద్దలు పెద్దపెద్ద మీడియా సంస్థలకు అధిపతులుగా ఉన్నారని పేర్కొన్నది. బీజేపీ తనకు అనుకూల వార్తలను ప్రచారం చేసుకోవడంతో పాటు, వ్యతిరేక కథనాలను, వార్తలను తిప్పి కొట్టడానికి సంవత్సరానికి ఏకంగా 140 మిలియన్ డాలర్లను ఖర్చు చేస్తున్నదని సమాధానం ఇచ్చింది. ముఖ్యంగా 2014 నుంచి విమర్శకుల గొంతులను నొక్కుతున్నట్టు తెలిపింది. మత విద్వేషాలను వ్యాప్తి చేసినందుకు ఏ రాజకీయ నాయకులను అరెస్టు చేస్తారని ఓ నెటిజన్ అడగగా.. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, బీజేపీ నేత గిరిరాజ్ సింగ్ వంటి వారు మతవిద్వేషాలను ఎక్కువగా ప్రచారం చేస్తున్నారని గ్రోక్ పేర్కొన్నది. దీంతో గ్రోక్ సమాధానాలపై విస్తృతంగా చర్చ జరుగుతున్నది. మరోవైపు గ్రోక్ వాడుతున్న పదజాలంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో ఏఐ చాట్ బాట్ వాడే భాషపై కొంత నియంత్రణ ఉండేదని, గ్రోక్ ఆ హద్దులను చెరిపేసిందని అంటున్నారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మరింత ఘాటు వ్యాఖ్యలు చేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## బీజేపీ దూకుడుకు కళ్లెం..

ఏఐ చాట్ బాట్ ఇస్తున్న సమాధానాలు సోషల్ మీడియాలో బీజేపీ దూకుడుకు కళ్లెం వేస్తున్నాయని విశ్లేషకులు చెప్తున్నారు. గ్రోక్ సమాధానాలు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలకు అస్త్రాలుగా మారాయని అంటున్నారు. ఎక్కువగా ఎక్స్‌లో వచ్చిన పోస్టులపై ఆధారపడి గ్రోక్ విశ్లేషణలు జరుపుతున్నదని, కాబట్టి పక్షపాతం చూపించే అవకాశం ఉన్నదని కొందరు బీజేపీ సానుభూతిపరులు వాదిస్తున్నారు. దీనికి ‘ఒకవేళ అదే నిజమైతే సోషల్ మీడియాలో బీజేపీ అనుకూల పోస్టులే ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఆ పార్టీకి, ఆ నేతలకు అనుకూలంగా మాత్రమే సమాధానాలు వస్తాయి కదా?’ అని కొందరు నెటిజన్లు కౌంటర్ వేస్తున్నారు. అన్ని కోణాల్లో విశ్లేషించిన తర్వాతే సరైన సమాధానాలు ఇస్తోందని అభినందిస్తున్నారు. దీంతో బీజేపీ మరింత ఇరుకున పడుతున్నట్టు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. దాదాపు దశాబ్దన్నర కాలంగా దేశంలో సోషల్ మీడియాను శాసిస్తున్న బీజేపీకి గ్రోక్‌ను ఎలా ఎదుర్కోవాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నట్టు చర్చ జరుగుతున్నది. దీంతో ఏకంగా ‘గ్రోక్ గో బ్యాక్’ ఉద్యమాన్ని ప్రారంభించిందని చెప్తున్నారు. ఏకంగా తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలై బహిరంగంగా ‘గ్రోక్ గో బ్యాక్’ ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారని గుర్తు చేస్తున్నారు. మరోవైపు ఈ అంశంపై కేంద్రం ఎక్స్ నుంచి వివరణ కోరిందని ప్రచారం జరుగుతున్నది. త్వరలో చట్టపరమైన చర్యలు తీసుకుంటుందనే చర్చ జరుగుతున్నది.

## ఐబీఎంలో 9వేల మంది ఉద్యోగులపై వేటు

వాషింగ్టన్, మార్చి 23: టెక్ దిగ్గజం ‘ఐబీఎం’ ఈ ఏడాది అమెరికాలో పెద్ద ఎత్తున ఉద్యోగాల తొలగింపును చేపడుతున్నట్టు తెలిసింది. 9 వేల మందిని విధుల నుంచి తొలగించబోతున్నట్టు సంస్థకు చెందిన విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. వివిధ విభాగాల్లోని సిబ్బంది సేవలను ఆఫ్‌షోర్ మార్గంలో పొందేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఇందులో ఎక్కువగా భారత్‌కు తరలిపోయే అవకాశముందని ‘ద రిజిస్టర్’ (బ్రిటిష్ టెక్నాలజీ న్యూస్ వెబ్‌సైట్) తాజా నివేదిక తెలిపింది. ఖాళీ అవుతున్న స్థానాల్ని ఆఫ్‌షోర్‌గా ఇండియాకు తరలించటం గత కొన్నేండ్లుగా జరుగుతున్నదేనని సంస్థకు చెందిన ఇన్‌సైడర్స్ చెబుతున్నారు.

## గాజాలో 50 వేలు దాటిన మరణాలు

### తాజా దాడిలో 26 మంది మృతి

గాజా స్ట్రిప్, : గాజాలో పాలస్తీనియన్ల మరణాలు 50వేలు దాటినట్లు గాజా ఆరోగ్య శాఖ తాజాగా ప్రకటించింది. శనివారం రాత్రి నుంచి ఇజ్రాయెల్ జరుపుతున్న వైమానిక దాడుల్లో 26 మంది మరణించారు. మృతుల్లో పాలస్తీనియన్ పార్లమెంట్, పొలిటికల్ బ్యూరో సభ్యుడు, హమాస్ రాజకీయ నేత సలా బర్దావిల్, అతని భార్య కూడా ఉన్నట్టు అధికారులు తెలిపారు. యుద్ధంలో ఇప్పటివరకు 1,13,000 మంది గాయపడ్డట్టు ఆరోగ్య శాఖ ప్రకటించింది.

## అమెరికాలో ఇద్దరు భారతీయుల కాల్చివేత

### తండ్రి, కుమార్తెగా గుర్తింపు

న్యూయార్క్ : అమెరికాలోని స్టోర్‌లో ఒక దుండగుడు ఇద్దరు భారతీయులను కాల్చి చంపాడు. ఈ కాల్పుల్లో భారత సంతతికి చెందిన తండ్రీ, కూతురు మరణించారు. వర్జీనియాలోని ఒక కన్వీనియన్స్ స్టోర్‌లో పనిచేస్తున్న భారత్‌కు చెందిన 56 ఏండ్ల ప్రదీప్‌కుమార్ పటేల్, 24 ఏండ్ల అతని కుమార్తెపై ఈ నెల 20న ఒక వ్యక్తి కాల్పులు జరుపగా, తండ్రి అక్కడికక్కడే మృతి చెందగా, కుమార్తె చికిత్స పొందుతూ మరణించింది.

## మహారాష్ట్రలో రోజుకు ఏడుగురు రైతుల ఆత్మహత్య

- నిరుడు 2,706 మంది బలవన్మరణం
- బీజేపీ పాలిత రాష్ట్రంలో ఇదీ దుస్థితి

ముంబై, మార్చి 23 (నమస్తే తెలంగాణ): బీజేపీ పాలిత మహారాష్ట్రలో అన్నదాతలు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం శాసన మండలికి తెలిపిన వివరాల ప్రకారం, నిరుడు రాష్ట్రంలో 2,706 మంది రైతన్నలు ఆత్మహత్య చేసుకున్నారు. అంటే, రోజుకు సగటున ఏడుగురు రైతులు బలైపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ రిలీఫ్ అండ్ రిహాబిలిటేషన్ డిపార్ట్‌మెంట్ ఈ వివరాలను శాసన మండలికి లిఖిత పూర్వకంగా సమర్పించింది. గత ఏడాదిలో అమరావతి డివిజన్‌లో 1,069 మంది, ఛత్రపతి శంభాజీనగర్ డివిజన్‌లో 952 మంది ఆత్మహత్య చేసుకున్నారు. ప్రభుత్వ తప్పుడు విధానాల వల్లే రైతు ఆత్మహత్యలు జరుగుతున్నాయని రైతు నేత రవికాంత్ తుప్కర్ విమర్శించారు.

## 28న రైతుల దేశవ్యాప్త నిరసన

### సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు.. పంజాబ్ పోలీసుల చర్యపై ఆగ్రహం

చండీగఢ్: డిమాండ్ల సాధనకు ఆందోళన చేస్తున్న రైతుల పట్ల పంజాబ్ పోలీసుల వైఖరిని నిరసిస్తూ మార్చి 28న దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) జాతీయ సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది. సమస్యల సాధనకు ఆందోళన చేస్తున్న రైతులపై పంజాబ్ పోలీసులు అణచివేత విధానాన్ని అవలంబించారని ఎస్‌కేఎం ఆరోపించింది. పోలీసుల వైఖరిని నిరసిస్తూ కిసాన్ మోర్చా, ఎస్‌కేఎం (రాజకీయేతర) తదితర రైతు సంఘాలు ఐక్యంగా ముందుకు వచ్చి అణచివేతపై పోరాటానికి దిగాలని విజ్ఞప్తి చేసింది. భగవంత్ మాన్ ప్రభుత్వం రాష్ట్రంలో రైతు నేతలు జగ్జీత్ సింగ్ దల్లేవాల్, శర్వణ్ సింగ్ పాంధేర్‌తో పాటు 350 మందిని అరెస్ట్ చేసిందని ఆరోపించింది.

# ఏప్రిల్ నుంచి పెరగనున్న కార్ల ధరలు

- 3-4% రేట్లు పెంచుతున్నట్టు ఆటోమొబైల్ కంపెనీల ప్రకటన
- ఉత్పత్తి వ్యయం, నిర్వహణ ఖర్చులు పెరగడమే కారణం




న్యూఢిల్లీ, మార్చి 23: దేశంలో కార్ల ధరలు మరింత పెరగబోతున్నాయి. రూపాయి మారకం విలువ తగ్గడం, ఉత్పత్తి వ్యయంతోపాటు నిర్వహణ ఖర్చులు అధికమవుతుండటంతో మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, హ్యుందాయ్ లాంటి దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాలు సహా మరికొన్ని ఇతర కంపెనీలు తమ వాహనాల ధరలను పెంచుతున్నట్టు ప్రకటిస్తున్నాయి. దీంతో ఏప్రిల్ నుంచి ఆయా కంపెనీల కార్ల ధరలు పెరగనున్నాయి. ప్యాసింజర్ కార్ల తయారీ విభాగంలో అగ్రగామి సంస్థగా కొనసాగుతున్న మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) తన అన్ని రకాల వాహనాల ధరలను 4% మేరకు పెంచేందుకు సిద్ధమవుతోంది. ఏప్రిల్ నుంచి హ్యుందాయ్ కార్ల ధరలను 3% వరకు పెంచబోతున్నట్టు ఆ కంపెనీ వెల్లడించింది. ఇదేవిధంగా మహీంద్రా అండ్ మహీంద్రా తన ఎస్‌యూవీలతోపాటు వాణిజ్య వాహనాల ధరలను 3% మేరకు పెంచనున్నట్టు తెలిపింది. కాగా, ఈ ఏడాది ఇప్పటికే ఓసారి వాహనాల ధరలను పెంచిన టాటా మోటర్స్ కంపెనీ.. వచ్చే నెల నుంచి తన ఎలక్ట్రిక్ వాహనాలతోపాటు ప్యాసింజర్ వాహనాల ధరలను మరోసారి పెంచనున్నట్టు స్పష్టం చేసింది. కియా, హోండా, రెనాల్ట్, బీఎండబ్ల్యూ కంపెనీలు కూడా ఏప్రిల్ నుంచి తమ కార్ల ధరలను పెంచబోతున్నట్టు ప్రకటించాయి. దేశంలో ఆటోమొబైల్ కంపెనీలు ఏటా రెండుసార్లు తమ వాహనాల ధరలను పెంచడం సాధారణమేనని డెలాయిట్ పార్ట్‌నర్, ఆటోమోటివ్ సెక్టార్ లీడర్ రజత్ మహజన్ తెలిపారు.

# ఇస్తాంబుల్ మేయర్ అరెస్ట్‌కు కోర్టు ఆదేశం

### అధ్యక్షుడు ఎర్డోగాన్‌కు ప్రధాన ప్రత్యర్థి.. అరెస్టుకు వ్యతిరేకంగా నిరసనలు

ఇస్తాంబుల్: ఇస్తాంబుల్ మేయర్ ఎక్రెమ్ ఇమమొగ్లును అరెస్ట్ చేయాలని టర్కిష్ కోర్టు ఆదివారం ఆదేశించింది. అవినీతి ఆరోపణలపై విచారణ పూర్తయ్యే వరకు ఆయనను జైలులోనే నిర్బంధించాలని తెలిపింది. ఆయన టర్కీ అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డోగాన్‌కు ప్రధాన ప్రత్యర్థి. ఎక్రెమ్ అరెస్టుతో టర్కీలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. పదేళ్లలో ఇంత తీవ్ర నిరసన వ్యక్తం కావడం ఇదే మొదటిసారి అని తెలుస్తున్నది. అంతేకాకుండా, టర్కీలో ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలనపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతున్నది. 2028లో జరిగే దేశాధ్యక్ష ఎన్నికల్లో కీలకమైన ప్రత్యర్థిని తప్పించడం కోసమే ఎక్రెమ్‌ను జైలుపాలు చేశారని విమర్శలు వస్తున్నాయి.



## ఎన్నికల కమిషన్ విఫల వ్యవస్థ

- న్యాయ వ్యవస్థపై విశ్వాసం సన్నగిల్లింది
- రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ‘సక్రమంగా పని చేయలేని’, ‘విఫల’ వ్యవస్థ అని రాజ్యసభ సభ్యుడు, సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ పేర్కొన్నారు. ఈసీ మీద అత్యధికులకు నమ్మకం లేదన్నారు. అది తన రాజ్యాంగపరమైన బాధ్యతలకు అనుగుణంగా పని చేయకపోవడమే దీనికి కారణమని వివరించారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకం క్షీణిస్తున్నదని సిబల్ ఆరోపించారు. న్యాయమూర్తుల నియామకాలతోపాటు ప్రస్తుత వ్యవస్థలు పని చేయడం లేదని, చాలా కేసుల్లో జిల్లా, సెషన్స్ కోర్టులు బెయిలు ఇవ్వడం లేదన్నారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ వివాదాస్పద ప్రసంగం గురించి ప్రస్తావించారు.

# నోట్లకట్టల వీడియోలను డిలీట్ చేయండి!

- జస్టిస్ యశ్వంత్ వర్మ కేసులో పోలీసులకు రహస్య ఆదేశాలు
- సాక్ష్యాలు నాశనం చేసే కుట్రగా అనుమానాలు



న్యూఢిల్లీ, మార్చి 23: ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ కేసులో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఈ నెల 14న జస్టిస్ వర్మ ఇంట్లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మంటలను ఆర్పుతున్న సందర్భంగా పెద్దయెత్తున నోట్ల కట్టలు బయటపడటం సంచలనం సృష్టిస్తున్నది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఆ రోజు అగ్నిప్రమాదంలో జడ్జి ఇంట్లో నోట్ల కట్టలు కాలుతున్న దృశ్యాలను అక్కడ ఉన్న పోలీసులు ఫోన్లలో వీడియో తీశారు. అయితే ఆ వీడియోలను వెంటనే మొబైల్స్ నుంచి తొలగించాలంటూ పోలీస్ ఉన్నతాధికారుల నుంచి సిబ్బందికి ఆదేశాలు వచ్చాయి. ఎంతో ముఖ్యమైన సాక్ష్యంగా పనికివచ్చే వీడియో సాక్ష్యాన్ని డిలీట్ చేయాలంటూ ఆదేశాలు రావడం ఏమిటని పోలీస్ శాఖలో చర్చలు ప్రారంభమయ్యాయి. ‘ఆ ఘటనకు సంబంధించిన వీడియోలు మీ ఫోన్‌లో ఉంచుకోవద్దు. వెంటనే డిలీట్ చేయండి. వాటి కాపీలు కూడా తీయవద్దు, ఉంచవద్దు. ఎవరికీ షేర్ చేయవద్దు.’ అంటూ తమకు ఆదేశాలు వచ్చినట్టు పోలీస్ శాఖలోని ఒక దిగువ ర్యాంక్ ఉద్యోగి తెలిపారు. కాగా, వర్మ ఇంటికి సమీపంలోని చెత్త కుప్పలో కాలిన 500 రూపాయల నోట్లు లభ్యం కావడం సంచలనంగా మారింది.




**ఆ ఆరోపణలు నిజం కాదు**

తన ఇంట్లో పెద్దయెత్తున కాలిన నోట్లు లభ్యమయ్యాయని వస్తున్న ఆరోపణలను జస్టిస్ వర్మ కొట్టివేశారు. ఈ మేరకు కేసు విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ దేవేంద్ర కుమార్‌కు లేఖ రాస్తూ తన ఇంట్లో అగ్నిప్రమాదం తర్వాత తన ఇంటి ప్రాంగణం నుంచి కానీ, స్టోర్ రూమ్‌లో నుంచి కాని ఎలాంటి కాలిన నోట్లను అధికారులు స్వాధీనం చేసుకోలేదని చెప్పారు.

**నోట్ల కట్టలు నిజమే..**

జస్టిస్ వర్మపై ఆరోపణలపై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలతో సీజేఐకు నివేదిక పంపారు. జస్టిస్ వర్మ ఇంట్లో నాలుగైదు గోతాంలలో పాక్షికంగా కాలిన నోట్లు లభ్యమైనట్టు తన నివేదికలో పేర్కొన్నారు. లభించిన ప్రాథమిక ఆధారాల మేరకు దీనిపై లోతైన విచారణ జరపాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. కాగా, జస్టిస్ దేవేంద్ర కుమార్ నివేదికను సుప్రీం కోర్టు శనివారం సాయంత్రం తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. దీనిపై విచారణకు ముగ్గురు జడ్జీలతో ఇప్పటికే కమిటీని ఏర్పాటు చేసింది.



## శని గ్రహ వలయాలు మాయం!

ఢిల్లీ: శని గ్రహాన్ని ప్రత్యేకంగా నిలిపే దాని వలయాలు కొన్ని రోజులపాటు అదృశ్యం కానున్నాయి. ఇది ఆదివారం రాత్రి 9.34 గంటలకు మొదలైంది. వాస్తవానికి ఈ వలయాలు పూర్తిగా మాయమైపోవు. కానీ, భూమిపై నుంచి చూసినప్పుడు మనకు అలా భ్రాంతి కలుగుతుంది. ఇది తాత్కాలికమే, రెండురోజుల్లో వలయాలు సాధారణంగా కనిపిస్తాయని పరిశోధకులు చెబుతున్నారు. శని గ్రహం సూర్యుడి చుట్టూ పరిభ్రమించేందుకు 29.4 ఏండ్లు పడుతుంది. ఒక్కసారి కక్ష్య చుట్టూ తిరిగే క్రమంలో ఈ వలయాల అదృశ్యం రెండు సార్లు జరుగుతుంది. ఈ అద్భుతం ప్రతి 13–15 ఏండ్లకు ఒకసారి జరుగుతుంది. ఇది మళ్లీ 2038లో జరిగే ఆస్కారముంది.




## డయాబెటిస్ రోగులకు క్యాన్సర్ ముప్పు అధికం!

న్యూఢిల్లీ, మార్చి 23: టైప్–2 డయాబెటిస్ రోగులకు ప్రాణాంతకమైన కాలేయం, పాంక్రియాటిక్ క్యాన్సర్లు వచ్చే ముప్పు ఎక్కువగా ఉందని బ్రిటన్ పరిశోధకుల తాజా అధ్యయనం అంచనా వేసింది. ముఖ్యంగా మహిళలు ఎక్కువ సంఖ్యలో క్యాన్సర్ బారినపడుతున్నట్టు పరిశోధకులు చెబుతున్నారు. బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ మాంచెస్టర్ పరిశోధకుల అధ్యయనం ప్రకారం, 95 వేల మంది హెల్త్ రికార్డ్స్‌ను విశ్లేషించగా.. టైప్–2 డయాబెటిస్ బారిన పడ్డ మహిళల్లో పాంక్రియాటిక్ క్యాన్సర్ ముప్పు రెండు రెట్లు, కాలేయ క్యాన్సర్ ముప్పు ఐదు రెట్లు పెరిగిందని తేలింది. పురుషుల్లోనూ క్యాన్సర్లు వచ్చే అవకాశాలు పెరిగినట్టు అధ్యయనం తెలిపింది.



## కూలిన 100 అడుగుల రథం

కర్ణాటకలో 100 అడుగుల భారీ రథం కూలింది. ఈ ప్రమాదంలో ఒకరు మరణించగా, ముగ్గురు గాయపడ్డారు. ఉత్సవంలో భాగంగా రాయసంద్రలోని చారిత్రక మధురమ్మ ఆలయ రథాన్ని భక్తులు ఆలయం వైపు లాగుతుండగా, ఒక్కసారిగా అది పక్కకు ఒరిగి కూలిపోయింది. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన లోహిత్ అనే వ్యక్తి మరణించగా, 16 ఏండ్ల బాలిక తీవ్రంగా గాయపడింది.



## సరిహద్దులో నిఘాకు ఏఐ రోబోలు

### ఐఐటీ గువాహటి అభివృద్ధి

న్యూఢిల్లీ, మార్చి 23: అంతర్జాతీయ సరిహద్దుల్లో నిఘా కోసం అధునాతన ఏఐ ఆధారిత రోబోలను ఐఐటీ గువాహటి పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఇవి సవాలుతో కూడిన భూభాగాలపై ఏఐ–ఆధారిత నిఘా, నిరంతర పర్యవేక్షణను అందిస్తాయని అధికారులు తెలిపారు. గువాహటి ఐఐటీ ఇంక్యుబేటెడ్ స్టార్టప్ కంపెనీ ‘డీఎస్ ఆర్‌ఎల్’ ఈ రోబోలను తయారుచేసిందని చెప్పారు. ఈ రోబోలతో నిఘాకు సంబంధించి ఆర్మీ ఇప్పటికే క్షేత్రస్థాయి ట్రయల్స్ నిర్వహించినట్టు ఐఐటీ అధికారులు తెలిపారు. మానవ గస్తీతో ఎదురయ్యే సవాళ్లను వీటితో అధిగమించవచ్చని పేర్కొన్నారు.